క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కందుకూరు రూరల్: మండలంలోని మహదేవ పురం సచివాలయ పరిధిలో సోమవారం ఉదయం 8:30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.వి జయశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో పాల్గొనాలని కోరారు.

నేడు వెల్లటూరులో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని వెల్లటూరు గ్రామంలో సోమవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

11న వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం

ఉలవపాడు: ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ సతీష్‌బాబు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి సమావేశంలో పాల్గొంటారని, వైద్యశాల సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నేడు పార్టీ మండల సమావేశం

పీసీపల్లి: పీసీపల్లి మండల సమావేశం సోమవారం కనిగిరి వైఎస్సార్ భవన్‌లో ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీపీ అత్యాల జనన్య తెలిపారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.10,116 విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి పట్టణానికి చెందిన శ్రీరామ అజయ్‌కుమార్ ధర్మపత్ని సుజాత రూ.10,116 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు సూరం వేణుగోపాల్‌రెడ్డి, ఆవుల మాధవరావులకు అందచేశారు. ఆలయ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

లింగసముద్రం: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు చెప్పారు. పెదపవని గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎస్సై విశ్వనాథరెడ్డి బదిలీ

వెలిగండ్ల: వెలిగండ్ల ఎస్సై పి.విశ్వనాధరెడ్డి నెల్లూరు జిల్లా మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బదిలీ అయిన ఎస్సై విశ్వనాధరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు వై.నాగూర్‌యాదవ్ టి.దేవసహాయం, ఎలికే నారాయణ, ఎలికే రమణయ్య, మేడమ్ ఆదిరెడ్డి, డి. చెన్నకేశవులు, పలువురు నాయకులు సన్మానించారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



ఎమ్మెల్యేను కలిసిన సేవా సమితి సభ్యులు

కందుకూరు అర్బన్: బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్కంధపురి బ్రాహ్మణ సేవా సమితి నూతన కార్యవర్గం ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఇప్పగుంట నాగరాజరావు ఉపాధ్యక్షులు దీక్షతులు, సహాయ కార్యదర్శి నాగరాజు, కోశాధికారి మోహన్, కార్యవర్గ సభ్యులు సురేష్, శ్రీనివాసరావు, శేషగిరిరావు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు. చారు.

మహిళకు వినికిడి యంత్రం అందజేత



సుగుణమ్మకు వినికిడి యంత్రం అందజేస్తున్న హరిబాబు

టంగుటూరు: మండలంలోని బుచ్చిరాజుపాలెం కాలనీకి చెందిన పారబత్తిన సుగుణమ్మకు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు ఆదివారం వినికిడి యంత్రం అందజేశారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబుకు ఆమె సమస్యను స్థానిక నాయకులు తెలియజేశారు. దీంతో పార్టీ నేతలు జిల్లా అధికారులతో మాట్లాడి వినికిడి యంత్రం మంజూరు చేయించారు. కార్యక్రమంలో మన్నం వెంకయ్య, ఎంపీటీసీలు బొడ్డు వాసంతి, కొమ్ము ప్రభుదాసు, దాసరి సుబ్బారావు, జిల్లా వికలాంగుల యూనియన్ పసుమర్తి రాజేష్, బొడ్డు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సైనికులే గృహ సారథులు

- పథకాల అమల్లో వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలి
- ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పార్టీ పట్ల నిబద్ధత, చిత్తశుద్ధి కల్గి, క్రమశిక్షణతో పనిచేసే వార్డు సైనికులుగా గృహ సారథులుగా ఉంటారని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఆదివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన కౌన్సిలర్ల, పార్టీ నాయకుల, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి వలంటీర్ పరిధిలో ఇద్దరిని గృహ సారథులుగా నియమించామన్నారు. వారిలో ఒకరు మహిళ ఉండాలన్నారు. రానున్న రోజుల్లో గృహ సారథుల చేతుల మీదుగానే పార్టీ అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. గృహ వారధులు వలంటీర్ పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి సమగ్ర నివేదికలను తయారు చేయాల్సి ఉంటుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ సారథులకు లైఫ్ ఇన్సూరెన్స్ కల్పిస్తామన్నారు. వలంటీర్లు బాధ్యతగా పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల దరి చేర్చాలన్నారు. బాధ్యతను విస్మరించే, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవన్నారు. పనిచేయని వలంటీర్లపై చర్యలకు నివేదికలు ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్సీగా శ్యాం ప్రసాద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

తూర్పు, రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్యాం ప్రసాద్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుపు నిచ్చారు. కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు తమ వార్డు పరిధిలోని పట్ట భద్రులను కలిసి శ్యాం ప్రసాద్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలానీ, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, దేవరాజ్, శ్రీ రాం సతీష్, రామనబోయిన శ్రీను, ఖాజా, పెన్నా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతను పెంపొందిస్తాయి

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: క్రీడలు యువతలో ఐక్యత భావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక గార్లపేట రోడ్డులోని వృద్ధాశ్రమం వెనుక గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే బుర్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో పట్టుదల, ఏకాగ్రత పెంచుతాయన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకుని ముందడుగు వేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, రామనబోయిన శ్రీను, షరీఫ్, కంటు గురవయ్య, కొండలు, బ్రహ్మయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ చేస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం: మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గో పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారులు నారాయణ స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో అభిషేకం, అర్చన, మహా నివేదన, గో పూజ, పల్లకీ సేవ తదితర పూజలు చేపట్టారు. మహా నివేదన పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్ల చేత బూని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మ నెల పొంగళ్లు



విరాళం అలందజేసిన చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

పామూరు: మండలంలోని పోతవరంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత నాగార్పమ్మ ఆలయంలో ఆదివారం నెలపొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు కురిమేటి జానకిరామయ్య విశిష్ట పూజలు చేశారు. పొంగళ్ల సందర్భంగా భక్తులు చన్నీటిస్నానమాచరించి పొంగళ్లతో ఉత్సవంగా ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ రూ.2.11 లక్షలు, ధనియాల బాలయ్య, కొండమ్మలు రూ.51 వేలను విరాళంగా అందజేయగా దేవస్థాన కమిటీ రమేష్, శ్రీరాములు, మాలకొండయ్య, వెంకటేశ్వర్లు పలువురు దాత చంద్రశేఖర్ సన్మానించారు. తిరుపతయ్య, తిరిపాలు, మల్లికార్జున రాహుల్‌యాదవ్ పాల్గొన్నారు.

వేణుగోపాలకృష్ణాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

కందుకూరు: పట్టణంలోని పొట్టి శ్రీరాములు పెద్దబజార్‌లో వేణుగోపాలకృష్ణాలయంలో ఆదివారం ధనుర్మాస 24వ పాశురం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి 60వెండి కుందీ దీపారాధనలతో విశేషాలంకార పూజలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

గురుతర బాధ్యతతో పనిచేయాలి

- ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

పామూరు: ఉపాధ్యాయులు గురుతర బాధ్యతతో పనిచేసి ప్రజామన్ననలు పొందాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన కార్యాలయం, కంప్యూటర్ గదిలను ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, ప్రముఖ పారిశ్రామికవేత్త కోటపాటి జనార్దన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్సీ విఠపు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యను బోధించేందుకు సన్నద్ధులు కావాలని, కార్యాలయం ఏర్పాటు శుభ పరిణామన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పొక్కిరెడ్డి బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, వి.పి.వెంకటసుబ్బయ్య, సీపీయం పశ్చిమ ప్రకాశంజిల్లా అధ్యక్షుడు సయ్యద్ హనీఫ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వి.వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కదిరి పార్థసారథి

సీఎస్‌పురం: సంక్రాంతిని పర్వదినాన్ని పురస్కరించుకొని దివంగత క్రికెట్ క్రీడాకారులు కేఎస్ రాయల్, ఎస్‌వి ప్రసాద్‌ల జ్ఞాపకార్థం రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆదివారం కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాల సెక్రటరీ కదిరి పార్థసారధి ప్రారంభించారు. పోటీల్లో 23 జట్లు పాల్గొంటుండగా ఆదివారం సీఎస్‌పురం బిపిసీఎల్– సీఎస్‌పురం దడ లెవెన్, వెంగనగుంట– సీఎస్‌పురం గల్లీబాయ్స్ జట్లు పోటీ పడ్డాయి. సీఎస్‌పురం దడ లెవెన్, వెంగనగుంట జట్లు విజయం సాధించాయి. కోవిలంపాడు ఉప సర్పంచ్ తీకెనం బాబూరావు, భారత్ గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం పెంపు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై, నాయకులు

సీఎస్‌పురం: క్రీడలు యువకుల మధ్య ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఎస్సై పి.అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, నారాయణస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి అన్నారు. స్థానిక డీజీపేట రోడ్డులో నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌వీజీ మెగా క్రికెట్ పోటీలను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగల వేళ యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఇటువంటి క్రీడలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో 40 జట్లు పాల్గొంటుండగా మొదటి రోజు కనిగిరి కేకేఆర్– వెంగనగుంట, సీఎస్‌పురం దడ బాయ్స్– కనిగిరి రావూస్ లవెన్ జట్లు పోటీ పడ్డాయి. వెంగనగుంట, సీఎస్‌పురం దడ బాయ్స్ జట్లు విజయం సాధించాయి. వైఎస్సార్ సీపీ నాయకులు ముడుమాల నారాయణరెడ్డి, బత్తుల దేవరాజు, ఎం అటేలయ్య, మిరికేల గురవయ్య, బహుమతు ప్రదాతలు బత్తుల రవీంద్రబాబు, బత్తుల బ్రహ్మరాజు, బత్తుల శ్రీనివాసులు, నిర్వాహకులు ఆర్ సాయిరవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ రూ.13 లక్షలతో అస్పత్రిలో మరమ్మతు పనుల చేయించేందుకు అధికారులను ఆదేశించామన్నారు. అస్పత్రిలో మార్చురి గదిలో వసతుల కల్పన, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి ప్రత్యేక చర్యలు తక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పీహెచ్‌సీల్లో పనిచేసే గైనకాలజిస్టులను తక్షణం డిప్యూటేషన్ వేస్తామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి మత్తు వైద్యున్ని, చిన్న పిల్లల వైద్యుని నియామకాలను చేపడతామన్నారు. సూపరిండెంట్ సయ్యద్ అబ్దుల్ కలాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, ఎంపీడీఓ జేవీబీ మల్లికార్జునరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకుల రెడ్డి, వైద్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫ్రీజర్ అందజేత



బాడీ ఫ్రీజర్ అందజేస్తున్న దాత

పామూరు: పామూరుకు చెందిన మానవత స్వచ్ఛందసేవాసంస్థకు బాబోలు ఏజెన్సీస్ నిర్వాహకులు పాబోలు శివ బాడీ ఫ్రీజర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రీజర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సంస్థ సభ్యులు వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, ఇమ్మడిశెట్టి కిషోర్, ఆకుల మాల్యాద్రి, కోడూరి ప్రభాకర్, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

10న టీఆర్‌ఆర్ కళాశాలలో ముగ్గుల పోటీలు

కందుకూరు రూరల్: పట్టణంలోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10గంటలకు నెల్లూరుకు చెందిన చిన్మయమిషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9000861863 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

74 మందికి వైద్య పరీక్షలు

గుడ్లూరు: ఇంటింటా వైద్యం–ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మవారిపాలెం, అడవిరాజుపాలెం గ్రామాల్లో రోగులను పరీక్షించారు. వైద్యాధికారి మారుతీరావు రెండు గ్రామాల్లో 74 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. గర్భవతులు, బాలింతలకు కూడా పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందచేశారు.

కో ఆప్షన్ సభ్యునికి రూ.25 వేల సాయం

లింగసముద్రం: మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ షఫీ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందాడు. ఆరోగ్యం మెరుగుపడిన తరువాత కావలిలో బంధువుల ఇంటి వద్ద ఉన్న షఫీని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆదివారం పరామర్శించి ఆరోగ్యం బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు. షఫీకి ఎమ్మెల్యే రూ.25 వేల నగదును అందజేశారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, మండల మీడియా అధికార ప్రతినిధి వరికూటి క్రిష్టారెడ్డి ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య



మాట్లాడుతున్న పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య

మర్రిపూడి: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా సైనికుల్లా పనిచేయాలని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య సూచించారు. మండలంలోని నర్సరాజుపాలెం గ్రామంలో ఆదివారం పోలేరమ్మ తల్లి పొంగళ్ల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆయన పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు మాటలు నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరుస్తుంటే ఓర్వలేక విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోద రమణారెడ్డి, సర్పంచ్ యాళ్ల రాణి హనుమంతరావు, ముదిరాజ్ సంఘ నాయకుడు మాచేపల్లి నాగయ్య, మర్రిపూడి, చిమట సొసైటీ అధ్యక్షుడు బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెట్టుబడిని సద్వినియోగం చేయడమే లక్ష్యం

- ప్రముఖ షేర్స్, చిట్‌ఫండ్స్ ఎనలిస్ట్ జె.వేణుగోపాల్



మాట్లాడుతున్న షేర్స్, చిట్‌ఫండ్స్ ఎనలిస్ట్ వేణుగోపాల్

సింగరాయకొండ: ఉద్యోగులు, వ్యాపారులు తమ వద్ద ఉన్న సొమ్మును షేర్స్, చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా పెట్టుబడిదారుల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రముఖ షేర్స్, చిట్‌ఫండ్స్ ఎనలిస్ట్, జెన్ మనీ జనరల్ మేనేజర్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక గంజి కళ్యాణ మండపంలో ఆదివారం మిరాయ్ ఎసెట్ మ్యూచ్యువల్ ఫండ్, జెన్ మనీ కంపెనీ బ్రాంచ్ నిర్వాహకులు కాకుమాని రవిచంద్ర, మందలపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్టుబడిదారుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎనలిస్ట్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల కారణంగా ముందు జాగ్రత్తగా ప్రతి వ్యక్తి జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా తప్పక చేసుకోవాలన్నారు. వ్యాపారం చేసే వ్యక్తులు, ఉద్యోగులు తమ వద్ద మిగులు ధనం ఉన్నప్పుడే ఆ మొత్తాలను అనుకూలమైన షేర్లలో, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా బలోపేతం కావడానికి సహకరిస్తున్నామన్నారు. ప్రజలు మోసపూరిత ప్రకటనల వల్ల తమ డబ్బు నష్టపోకుండా జాగ్రత్తలు తెలియజేస్తున్నామన్నారు. జెన్‌మనీ కంపెనీ ఉపాధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్, మిరాయ్ ఎసెట్ మ్యూచువల్ ఫండ్ ఏరియా హెడ్ వాలా కృష్ణ చైతన్య, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

కదిరి బాబూరావు కళాశాల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థిని పావని

సీఎస్‌పురం: ఉద్యానవన కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యానవన కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శనివారం జరిగాయి. పోటీలలో శీలంవారిపల్లి కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జి.పావని 200 మీటర్ల పరుగుపందెంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. హైజంప్‌లో బాలికల విభాగంలో ఎం లక్ష్మీప్రసన్న తృతీయస్థానం, బాలుర విభాగంలో విశ్వనాథరెడ్డి తృతీయస్థానంలో నిలిచి వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జానకీరాం చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కదిరి పార్థసారధి, డీన్ వీరన్నగౌడ్ అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో కలిసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో 1989–94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలు, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న, స్వగ్రామాల్లో వివిధ రకాల వృత్తులు, వ్యవసాయం చేసుకుంటున్న 100 మంది పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. చదువుకుంటున్న రోజుల్లో వారు చేసిన అల్లరి, ఆటపాటలు తమ స్నేహితులతో కలిసి ఆనందంగా పంచుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ చిన్ననాటి స్నేహితులు చేజర్ల ప్రసాద్‌కు రూ.20 వేలు, దాసరి రమణమ్మకు రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందచేయాలని తీర్మానించుకున్నారు.

వెండి కిరీటం బహూకరణ



అమ్మవారికి వెండి కిరీటం బహూకరిస్తున్న దాతలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన త్రిముఖ దుర్గాదేవి అమ్మవారికి ఆదివారం దాతలు వెండి కిరీటం బహూకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సిద్దురమణారెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా పొద్దుటూరు గ్రామానికి చెంది మైదుకూరు మున్సిపల్ కమీషనర్ గా ఉన్న దండే రాముడు కుటుంబ సమేతంగా ఆదివారం భైరవకోనకు విచ్చేశారు. అక్కడి జలపాతాన్ని సందర్శించి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాలలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి రూ.80 వేల విలువైన కిరీటాన్ని అందజేశారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న బాలికలు, మహిళలు

గుడ్లూరు: సంక్రాంతి పండుగను పురష్కరించుకొని నెల్లూరుకు చెందిన చిన్మయి మిషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన వచ్చింది. పోటీల్లో 100 మంది మహిళలు, బాలికలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేసి రంగులు అద్దారు. పోటీలలో గెలుపొందిన మయూరి(ప్రథమ), నాని (ద్వితీయ), అమృత (తృతీయ), కావ్యశ్రీ(నాల్గవ)లకు కార్యదర్శి రాంప్రసాద్ బహుమతులు అందచేశారు.